# రైలు వెళ్ళిపోయింది



ద్విభాష్యం రాజేశ్వరరావు

"ఇదిగో, ఇది టూ టైర్ లిస్టు. త్రీటైరుది దాని క్రిందవుంది. ఈ ఆఖరిమూడు బెర్తులూ అనకాపల్లిలో ఎక్కుతాయని చెప్పు! లేకపోతే అప్పారావుగాడు అర్ధ రూపాయకీ, పావలాకీ కక్కుర్తిపడి అవి కాస్తా నింపుకొని వెళ్ళిపోతాడు. అనుమానాలుంటే కబురుపెట్టు, నే వెళ్తాను!" రిజర్వేషను లిస్టులు రెండూ చలపతి ఎదర టేబులుమీద పడేసి, ఇవ్వాల్సిన సలహాలు ఇచ్చేసి వెళ్ళిపోయాడు, బుకింగ్ క్లర్కు.

కాగితాలు చేతిలోకి తీసుకున్నాడు చలపతి.

కోటా బెర్తులు అన్నీ నిండిపోగా ఇంకా వెయిటింగు లిస్టులో ఎనిమిది పేర్లున్నాయి. అందులో నాలుగు లేడీస్ పేర్లు! సీట్లు సరేసరి! సుమారు ఇరవయికి పైగా వెయిటింగ్ లిస్టులోవున్నాయి. ఇవి కాక ఇంకా ఎంతమంది ప్లాట్‌ఫారంమీద ఎగబడతారో! సీట్లూ, బెర్తులూలేవుబాబూ' అని అరిచి వాళ్ళకు సమాధానం చెప్పేసరికి ప్రాణంపోయినంత పనవుతుంది. మెయిలు ప్లాటుఫారంమీద నిలబడ్డ అరగంటసేపూ అష్టావధానం చేయాలి! ప్రాణంపోకుండా కాపాడుకోవాలి! రోజూ అలవాటయిన పనే అయినా ఆ అరగంట కష్టమూ తలుచుకుంటే నీరసం ఆవహించింది చలపతికి!!

టికెట్ నెంబర్లు 'రిపీట్' అయ్యాయేమోనని 'చెక్' చేసుకుంటున్నాడు చలపతి.

"నమస్కారం సార్!"

తలెత్తి చూసేడు.

"రిజర్వేషన్ టి. సి. మీరేనా?"

అవునన్నట్లు అతనివంక చూస్తూ తలూపేడు చలపతి.

"నా భార్య కొచ్చిన్ వెళ్ళాలి సార్! ఒక్కతే ప్రయాణం చేస్తోంది! పైగా నిండు మనిషి? ఎలాగైనా ఒక బెర్తు కావాలి సార్!" ప్రాధేయపడుతున్నట్లు అడిగేడు.

"లాభంలేదు సార్! అన్నీ నిండిపోయాయి!" అన్నాడు యధాలాపంగా చలపతి.

"అలా అంటే ఎలా సార్! ఒక్క బెర్తు సర్దారంటే మీ ఋణం ఉంచుకోను.

ఇదిగో టికెట్టు!" అంటూ ఆ వ్యక్తి జేబులోని టిక్కెట్టు తీసి టేబుల్ మీద చలపతి ఎదర వుంచేడు.

"కోటా నిండిపోతే నేను ఎక్కడ నుంచి తెచ్చి ఇవ్వను చెప్పండి? ఇంకా వెయిటింగ్‌లో చాలామంది వున్నారు. ఇవిగో లిస్టులు!"

"అంతేనా సార్ !" నిరాశగా అన్నాడు ఆ వ్యక్తి.

"అంతే! నేనేం చెయ్యలేను!" అంటూ లిస్టు చెకింగ్‌లో మునిగిపోయాడు చలపతి.

అయితే ఆ వచ్చిన పెద్దమనిషి కదిలి వెళ్ళలేదు.

"సార్! ఈ అయిదురూపాయలు ఉంచండి!" అంటూ మెల్లగా నోటు చలపతి చేతిలో వుంచబోయాడు.

"క్షమించండి! నాకు అలాంటి అలవాట్లు లేవు!'' చ ల ప తి సీరియస్‌గా చెప్పాడు.

ఆ వ్యక్తి ముఖం సిగ్గుతో ముడుచుకుపోయింది. టేబిలుమీదిటిక్కెట్లు తీసుకొని నిరాశగా బయటకు వెళ్ళిపోయాడు. బయట నిలబడిన ఆవిడతో ఏదో చెప్తున్నాడు. ఆవిడ ఆ పెద్దమనిషి భార్య కాబోలు! నిండు గర్భిణి! ఆవిణ్ణి చూస్తే చాలా జాలికలిగింది చలపతికి!

మెయిలులో రిజర్వేషన్లు, ఫస్టుకాసు బోగీలుపోగా మామూలుబోగీలు ఒకటో రెండో వుంటాయి. వాల్తేరునుంచి మద్రాసు వెళ్ళే మెయిలుకి అవి ఎప్పుడూ రద్దీగానే వుంటాయి. నిండుచూలాలు ఆ మామూలు బోగీల్లో నిలబడి అంత దూరం ప్రయాణించటం కష్టమని చలపతికి తెలుసు! కాని, వెయిటింగ్ లిస్టులో అంతమంది ఉండగా అందర్నీ తోసి రాజని ఆమెకు బెర్తుగాని, సీటుగాని ఎలా ఇవ్వటం పేర్లు కాస్త క్రిందా మీదా జరిపి 'ఎడ్జెస్టు' చెయ్యొచ్చు? కాని తాను ప్రాణంపోయినా అలాటి పని చేయలేదు. చేయగలిగివుంటే కొంతమంది రిజర్వేషన్ టి.సి. ల్లాగ తాను కూడా ఈసరికి ఒకటి రెండు మేడలు లేపగలిగి వుండేవాడు!

ఆ గదిలోనే ఇంకో వారగా టి. సి. రామానుజం కూర్చొని టిక్కెట్లు సార్టు చేస్తున్నాడు.

"ఇంకా నీకు టెర్మ్ ఎంత కాలం వుందోయ్?'' అన్నాడతడు చలపతితో.

"ఏ టెర్మ్?" అన్నాడు చలపతి.

"అదే! రిజర్వేషను టి. సి. గా !''

''ఇంకో నెలరోజులుంది! ఈ నెల దినాలూ సవ్యంగా గడిస్తే ఈ రొంపి నుండి బయటపడతాను! ప్రాణంపోయిగా వుంటుంది!"

రామానుజం గట్టిగా నవ్వేశాడు.

''నువ్వు భలేవాడివోయ్ మొత్తానికి! రిజర్వేషను టి. సి. అంటే బంగారు పిచ్చుకలాటి పోస్టు. అలాటిదాన్ని పట్టుకొని నువ్వు రొంపి, రొచ్చు అని బాధ

పడిపోతున్నావు. ఈ పోస్టులో ఎవరున్నా సంవత్సరం తిరిగేసరికి ఒక 'ల'కారం కళ్ళజూస్తారు. అయినా, ప్రాప్తంవుండాలిలే!"

చలపతి మాట్లాడలేదు.

రామానుజం చెప్పినదాంట్లో నిజం లేకపోలేదు!

ఒక్కొక్క బెర్తుకూ మూడు రూపాయలనుండి, అయిదు రూపాయలవరకు లంచం సంపాదించవచ్చు. రైలులో ప్రయాణించే ప్రతివాళ్ళూ ఎక్కువసామానుతో ఎక్కువ సౌఖ్యం కోరుకుంటారు. అటువంటి సౌఖ్యం లభించేదీ, సామానుకు రక్షణ లభించేదీ, మామూలు మనిషికి సైతం అందుబాటులో వుండేదీ ఈ రిజర్వేషను బోగీలే! మొదటి తరగతి ప్రయాణీకులుసైతం ఈ రోజుల్లో వీటికే ఎగబడుతున్నారు, సూక్ష్మంలో మోక్షం కనుక! ముప్ఫయ్యో నలభయ్యో ఖర్చు పెట్టి దూరప్రయాణాలకు టిక్కెట్లు కొనుక్కొని రిజర్వేషనుకు అయిదో, పదో లంచం పారెయ్యటం వాళ్ళకు పెద్ద కష్టమనిపించదు. కాని, అది తీసుకోటానికిమాత్రం తనకే మనసు ఒప్పదు. సుమారు పదకొండు నెలలుగా ఈ పోస్టులో వున్నాడు తను. ఒక్కనాడు కూడా తనెవరినుండి నయాపైస కూడా తీసుకోలేదు. అందువలన అనేక కష్టనిష్ఠూరాలు పడ్డాడు. అయినా, ఆపని మాత్రం చేయలేకపోయాడు. చెడు చేయటానికి కూడా కొంత గుండెనిబ్బరం కావాలి! ఆ నిబ్బరం తనకి లేదు !!

'దయచేసి వినండి! హౌరా నుండి మద్రాసు పోవు మెయిలు పదిహేను నిమిషములలో ఒకటవ నెంబరు ప్లాటు ఫారమునకు వచ్చును!'

అమ్మాయిగొంతు స్పీకర్లలో విన్పిస్తోంది. అది తెలుగే! సందేహం లేదు ! ఆ తరవాత చెప్పే రెండుభాషలూ అసలు అర్థంకావు!

అంతలో పోర్టరు నారయ్య వచ్చేడు

"ఏం నారయ్యా, బాగున్నావా?" అన్నాడు చలపతి.

"కూలోళ్ళ బతుక్కి బాగోగులేంటి సార్!..." అంటూ తన మామూలు ధోరణిలోనే సంభాషణ ప్రారంభించేడు నారయ్య. "ఈవేళ మీరుకాదంటే లాభం లేదు సార్! కంట్రాక్టరుగోరికి మూడు బెర్తులు కావాలి!ఇదిగో పదిరూపాయలు" ఆఖరుమాటలు దూరంగా కూర్చున్న రామానుజం చెవిని పడకుండా మెల్లగా అని ఆ నోటు చలపతి చేతిలో పెట్టబోయాడు నారయ్య.

చలపతి చేయి విదిలించుకున్నాడు.

అలాగంటే ఎలా సామీ! పోనీ మరో రెండు ఉంచండి! అదు నా కిచ్చినవే పదిహేను రూపాయలు. మీకు పన్నెండు పోతే నాకు మూడు కమీసను!" అన్నాడు నారయ్య రహస్యం చెప్తున్నట్లు !

చలపతి చికాకుగా రిజర్వేషను లిస్టు అతని ఎదుట పడేశాడు!

"ఇదిగో పెన్సిలు! బెర్తులు ఖాళీగా వుంటే నువ్వే రాసుకో!" అన్నాడు.

నారయ్య మహా జ్ఞానిలా నవ్వేడు.

''సార్! నే నోమాట చెప్పనా? కాగితాలు నాఎదర పడేసి రాసుకోమన్నారు. నేనే మీ సీటులో వుంటే ఇంకో పది మందికి రాసేద్దును. కాని నేను చదువుకోలేదు.''

"అదృష్టవంతుడివి! చదువు రాకపో బట్టే హాయిగా వున్నావు. లేకపోతే నువ్వెన్ని అన్యాయాలు చేద్దువో!''

"మీరు ఇవ్వాలనుకుంటే ఇవ్వొచ్చు సార్! మీ కయన్నీ నే చెప్పాలా ఏటి?''

అంటూ నవ్వేడు నారయ్య.

''నారయ్యా ఇంకేం చెప్పకు! ఈ డబ్బు తీసుకుపో! నాకు వద్దు! ఆఖరున ఖాళీలు వుంటే తప్పక ఇస్తాను! ఇదిగో ఈ ముప్పయి పైసలూ తీసుక వెళ్ళి నాకు ఒక కాఫీ తెచ్చిపెట్టు! తల నొప్పిగా వుంది!" అన్నాడు చలపతి,

"మరచిపోవద్దు సార్!" అంటూ కాఫీ తీసుకురావటానికి వెళ్ళేడునారయ్య.

రెండుచేతులతో తల పట్టుకొని భారంగా కుర్చీలో వెనక్కు వాలేడు చలపతి. బయట ప్లాట్‌ఫారం చాలా కోలాహలంగా వుంది.

నాలుగో నెంబరు ప్లాట్‌ఫారం మీద ప్యాసింజెరు గట్టిగా కూతపెట్టి అరుస్తోంది. టిక్కట్లు సార్టింగు పూర్తిచేసి వాటిని కట్టకట్టి బయటకు వెళ్ళిపోయాడు రామానుజం. రూములో చలపతి ఒక్కడే మిగిలిపోయాడు.

అంతలో శంకరం వచ్చేడు!

"ఏం శంకరం! డ్యూటీ అయిపోయిందేమిటి?" అన్నాడు చలపతి.

"ఉదయం నైన్‌కే దిగేను గురూ! ఇదిగో, ఈయన విశ్వనాధంగారని కాల్టెక్సులో పనిచేస్తున్నారు," అంటూ తనతో వచ్చిన మధ్యవయస్కుడిని పరిచయం చేసేడు శంకరం.

పరిచయం పూర్తయ్యాక శంకరం చెప్పబోయేది చలపతికి తెలుసు!

ఈయన మద్రాసు వెళ్ళాలి. ఒక బెర్తు సర్దు గురూ! లిస్టులో కుదరకపోతే కండెక్టరుతో నేను చెప్పేనని చెప్పి ఎక్కించెయ్!" అన్నాడు.

''సరే!" అన్నాడు చలపతి! శంకరంకూడా స్లీపర్‌కొచ్ కండక్టరే! తను కాదని ఎలా చెప్పటం?

శంకరం అయన్ను వదలి వెళ్ళిపోయేడు.

విశ్వనాధం చలపతి ఎదుటి కుర్చీలో కూలబడ్డాడు.

''ఏమైనా, మీ ఉద్యోగాలు సుఖం సార్! మేం షిఫ్టుల్లో పని చేయలేక చస్తున్నాం" అన్నాడు విశ్వనాధం.

చలపతి నవ్వుకున్నాడు!

"చూడండి! మరొక్క పది నిమి




షాలలో మెయిలు వస్తుంది. అప్పుడు నా సుఖం మీరుచూద్దురుగాని? ఎయిర్ కండిషన్డు కంట్రోలు రూములో పనిచేస్తూ షిఫ్టు డ్యూటీలని మీరు బాధపడుతున్నారు. పగలు ఎండలో వానలో ఈ గాడిదచాకిరీ చేయలేక అందరినీఒప్పించలేక, ఎవరిమెప్పూ పొందలేక మేం సతమత మవుతున్నాం. ఒక్క రాత్రి నిద్రపోవటానికి రైలులో బెర్తు చూపెట్టలేకపోతే ప్లాట్‌ఫారం మీది మనుషులందరికీ మేం విరోధులమే! మీ కున్న సదుపాయాలు, సౌకర్యాలు, జీతాలు ఈ విశాఖపట్నంలోఎవరికున్నాయిసార్, చెప్పండి" అంటూ ఆగేడు చలపతి.

వాటన్నిటికీ అంగీకరించినట్లు చిన్నగా నవ్వి ఊరుకున్నాడు కాల్టెక్సు విశ్వనాథం. అంతలో నారయ్య కాఫీ తెచ్చేడు.

"కాఫీ తీసుకోండి" అంటూ విశ్వనాధానికి ఆఫర్ చేసేడు.

"థేంక్యూ సార్! ఇప్పుడేతీసుకున్నా మీరు తీసుకోండి!"

కాఫీ త్రాగి కుర్చీకున్న తెల్లకోటు అందుకుని అందులో శరీరాన్ని దూర్చేడు చలపతి.

కోటులోదూరి బయటకువెళితే రేచుకుక్కల్లా మీదపడతారు జనం. అయినా తప్పదు!!

"మీరు మెయిలు వచ్చేక కౌంటరు దగ్గరకు రండి. మెయిల్లో లిస్టు వస్తేగాని పైనుండి ఎన్ని బెర్తులు ఖాళీ వచ్చాయో

తెలీదు అప్పుడు మీకు "ఎలాట్" చేస్తాను. లేదా అప్పారావుకి అప్ప చెప్తాను," అంటూ విశ్వనాథాన్ని పంపేసి లిస్టులు తీసుకుని బయటకు నడిచేడు. రూములోంచి బయటకు వస్తుంటే ప్లాట్‌ఫారంమీద నానిగాడు కనబడ్డాడు.

"ఏరా నానీ! ఇలా వచ్చేవ్ ?!" అన్నాను.

"అమ్మ తమ్ముణ్ణి డాక్టరు దగ్గరికి తీసుకెళ్తుందట. నిన్ను అడిగి అయిదు రూపాయలు తీసుకరమ్మంది?" నానిగాడు వాడు అప్పచెప్పవలసిన పాఠం అప్ప చెప్పేసి తన బాధ్యత తీరినట్లు తండ్రి వంకే చూస్తూ నిలబడ్డాడు.

పేంటుజేబులోని రెండు రూపాయల నోటుతీసి నానిగాడి కిచ్చేస్తూ అడిగేడు.

"డాక్టరు దగ్గరికి ఎందుకు?"

"ఉదయం నుంచీ విరోచనాలవుతున్నాయి. తమ్ముడు బాగా నీరసంగా అయిపోయాడు," అన్నాడు నానిగాడు,

"సాయంకాలం వచ్చేటప్పుడు ఎవర్నయినా అడిగి తెస్తాను. అందాకా ఆ రెండు రూపాయలూ డాక్టరుకు ఇవ్వమను!" అంటూ వాణ్ణి పంపించేశాడు. నానిగాడు కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళిపోయాడు.

"హౌరా నుండి మద్రాసు పోవు మెయిలు ఒకటవ నెంబరు ప్లాట్‌ఫారమునకు వచ్చుచున్నది," అంటూ స్పీకరులో గోల వినిపించింది.

ప్లాట్‌ఫారం మీద సంచలనం ప్రారంభమయింది,

పోర్టర్లు తలగుడ్డలుసర్దుకుంటున్నారు.

సమూహాలతః కదలికః కోలాహలం

"జీవచైతన్యానికి సరియైన ప్రతీక రైల్వే ప్లాట్‌ఫారం కాబోలు" అనుకున్నాడు చలపతి.

మెల్లగా నడిచి రిజర్వేషను బోను చేరుకున్నాడు. ఈలోగానే జనం వెంబడించటం ప్రారంభించేరు,

"లిస్టు రానివ్వండి సార్!" అంటూ జనాన్ని తోసుకుంటూ బోనులోనికి చేరి తలుపులు బిగించుకున్నాడు.


పెద్దగా శబ్దంచేస్తూ మెయిలు ప్లాట్‌ఫారం మీదకు వచ్చి ఆగింది. ఒక్కసారి జనమంతా కౌంటరుమీదికి ఎగబడ్డారు.

చలపతికి లోపల ఊపిరి ఆడటం లేదు!

"మీరు క్యూలో నిలబడితేతప్ప నేను ఎవరికీ సహాయం చేయలేను!" అన్నాడు చలపతి పెన్సిలు జేబులోంచి తీస్తూ.

ఈమాటలు చుట్టూవున్న జనానికి పట్టలేదు.

మెయిల్లోంచి దిగిన కండెక్టరు జనాన్ని తప్పించుకుంటూ "ఖాళీలున్నవి రెడ్ పెన్సిల్‌తో నోట్ చేసేను, లిస్టులు తీసుకో," అంటూ కాగితాలు చలపతి ఎదర పడేసి తన అవతారం చాలించుకొని వెళ్ళిపోయాడు. లిస్టు 'వెరిఫై'



చేసుకొని ఎన్ని ఖాళీలు వున్నాయో తేల్చుకునే సరికి మరో అయిదు నిమిషాలు పట్టింది.

చుట్టూ మళ్ళీ గోల ప్రారంభమయింది.

''సార్! సార్! ఒక్క బెర్తు సార్!

''లేడీస్‌తో వున్నాం ఎలాగయినా మూడు బెర్తులు కావాలి సార్!''

"నా నెంబరు వెయిటింగ్ లిస్టులో వుంది కాస్త చూస్తారా?''

"హౌ ఎబవుట్ మై బెర్త్?''

"చలపతీ నా నెంబరు ఏ బోగీలో వుందో చూడు!"

రకరకాల కంఠాలు చలపతి మీద దాడి ప్రారంభించేయి.

''మీరు గోల మాని క్యూలోకి రండి. ముందుగా, రిజర్వ్ చేయించుకున్న వారి పేర్లు పిలుస్తాను. వాళ్ళకి బోగీ నెంబర్లు వేసేక మిగిలిన వాళ్ళకి ఖాళీలనుబట్టి ఇస్తాను. నా డ్యూటీ నేను సక్రమంగా చేయాలంటే మీరందరూ నాకు సహకరించాలి. ప్లీజ్! హెల్ప్ మి టు హెల్ప్ యు!"

సాధ్యమయినంత వినయంగా చెప్పేడు చలపతి.

జనంలో కాస్త అల్లరి తగ్గింది.

రిజర్వేషను పేర్లు పిలుస్తూ బోగీ నెంబర్లువేసి ఇచ్చేడు!

వెయిటింగులోవున్న మొదటి నలుగురికే ఖాళీగావున్న నాలుగు బెర్తులూ సర్దేడు. ఖాళీగావున్న పన్నెండు సీట్లు వెయిటింగ్ లిస్టులోని మొదటి పన్నెండు మందికే ఎలాట్ చేసేడు,

లిస్టులు మడతపెట్టి "సారీ సార్! ఇక అన్నీ పూర్తయ్యాయి. దయచేసి అందరూ వెళ్ళిపోండి" అన్నాడు.

జనం ఒక్కసారి మళ్ళీ ఎగబడ్డారు.

అంతలో మెయిలు అయిదు నిమిషాల్లో బయలుదేరనున్నట్లు స్పీకర్లో ప్రకటన వినిపించింది.

జనం రైలువద్దకు ఒక్కొక్కరే కదిలిపోయేరు.

కాల్టెక్సు విశ్వనాథాన్ని కండెక్టరుకు అప్పగించాల్సిన బాధ్యత ఇంకా మిగిలిపోయింది చలపతికి.

కటకటాల కౌంటరు తలుపులు తెరచుకొని బోనులోని మేకపిల్ల బయటకు వచ్చినట్లు బయటపడ్డాడు.

కండెక్టరుకు విశ్వనాథాన్ని అప్పగించేడు.

ప్రక్క కంపార్టుమెంటులో కొచ్చిన్ వెళ్ళాల్సిన నిండు గర్భవతి నిలబడి వుంది. క్రిక్కిరిసిన జనం మధ్య నిలబడి చలపతి వైపు నిస్సహాయంగా చూస్తోంది.

చలపతికి మనసు కరిగి నీరయింది.

టూ టైర్ కండెక్టరు వద్దకు వెళ్ళి 'గురూ, చిన్న సాయంచేయి! కొచ్చిన్ వెళ్ళాల్సిన ఒకామె వుండిపోయింది. నిండుచూలాలు నీకు వీలయితే ఎక్కడయినా సర్ది కూర్చోపెట్టు!'

కండక్టరు చలపతివంక విచిత్రంగా చూసి నవ్వేడు.

చలపతికి ఒంటిమీద తేళ్ళు పాకినట్లయింది.

"తీసుకురా! నీకంటే ఆప్తులెవరున్నారు?" అన్నాడు.

చలపతి ఆమెను తీసుకువచ్చి టూ టైర్‌లో ఎక్కించేడు. ఆమె కృతజ్ఞతాపూర్వకంగా చలపతివంక చూసింది. ఆమె భర్త చలపతికి ఎన్నో థేంక్సులు చెప్పేడు. చలపతి చెమట తుడుచుకుంటూ రిటైరింగ్ రూమువంక కదిలిపోయేడు.

మెయిలు కూతపెట్టి మెల్లగాకదిలింది

"మళ్ళీ జన్మలో అడవిలో మానై పుట్టించు, ఈ టి. సి. గా మాత్రం వద్దు భగవాన్!" అనుకున్నాడు చలపతి మనసులోనే.


* * *

సుమారు రెండు నెలలు గడిచిపోయేయి.

చలపతికిప్పుడు ముళ్ళకిరీటం నెత్తిమీద లేదు! గేటుదగ్గర టిక్కెట్లు చెకింగ్ చేయటమే అతని పని!

ఎవరితోనూ విరోధాలు లేవు, మిగుల్చుకున్న పాత సభ్యతకూడా ఏమీ లేదు! తన డ్యూటీ ఎనిమిది గంటలూ తాను చేసుకోవటం! ఎవరితోనూ ప్రమేయంలేదు. ఎవరి వత్తిడీ లేదు!

ఇప్పుడు ప్రకాశం రిజర్వేషను టి. సి. గా వెళ్ళేడు. మనిషి సమర్థుడే బ్రతకనేర్చినవాడే! ప్రస్తుతం ప్రకాశం ఆ డ్యూటీలో చూపిస్తున్న చలాకీతనం




తానుచూపించ లేకపోయేవాడు. కారణం తనకే తెలీదు!!

'రిటైరింగ్‌రూము' లో కూర్చొని టిక్కెట్లు 'స్టార్' చేస్తున్నాడు చలపతి! మెయిలు వచ్చేవేళ అయింది, ప్రకాశం లిస్టు చూస్తున్నాడు. అంతలోనే మెయిలు ప్లాట్‌ఫారంమీదకు వస్తున్నట్లు ప్రకటన విన్పించింది. ప్రకాశం కోటు తొడుకొని ప్లాట్‌ఫారంమీదకు వెళ్తూ అన్నాడు.

"చలపతీ:మా రెండోవాడు వస్తే కూర్చోమని చెప్పు. మెయిలుపని చూసుకొని వస్తాను!"

అలాగే నన్నట్లు తలవూపి మళ్ళీ పనిలో పడ్డాడు చలపతి.

ప్రకాశం వెళ్ళిపోయాడు.

మెయిలువచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది.

"సార్! మా నాన్నగారు వున్నారా?"

'స్టారింగు' ఆపి తల ఎత్తి చూసేడు చలపతి.

ప్రకాశం రెండో కొడుకు! పదమూడేండ్లవాడు!!

టెర్లిన్ బట్టల్లో రాకుమారునిలా కనిపించేడు. కుర్రవాడి కళ్ళనిండా దర్పం, విశ్వాసం కనిపించేయి.

వెంటనే చలపతికి తన రెండోకొడుకు జ్ఞాపకానికి వచ్చేడు. వాడికి కడుపులో 'అల్సరు' వుందన్నాడు డాక్టరు కడుపులో ఆకలేకాకుండా 'అల్సరు' కూడా వుంటుందని తెలిసింది చలపతికి.

దాన్ని ఆపరేట్ చేయించాలి! కనీసం రెండు వందలు అవుతుంది! డబ్బు చాలక ఆపరేషను వాయిదా వేస్తున్నాడు. తన నిస్సహాయస్థితి జ్ఞాపకానికి వచ్చి

కళ్ళు చెమ్మగిల్లాయి చలపతికి! వెంటనే తేరుకొని "కూర్చో బాబూ! వచ్చేస్తాడు! నువ్వేం చదువుతున్నావ్?" అన్నాడు.

"టెన్తుక్లాస్" అన్నాడు ఆ కుర్రాడు.

ఇంకా ఏవేవో ప్రశ్నలు అడిగేడు చలపతి. అన్నిటికీ ధీమాగా సమాధానాలు చెప్పేడతను.

తనకొడుకు లెప్పటికయినా ఇంత ధీమాగా మాట్లాడగలరా? ఉహు! సాధ్యం కాదు!

దరిద్రంలో వున్న ఏ మనిషీ తాను ధైర్యంగా ఉండలేదు. తన పిల్లల్ని ధీమాగా మెలిగేటట్లు పెంచలేడు!

అంతలోనే ప్రకాశం వచ్చేడు!!

మెయిలు వెళ్ళిపోవటానికి సిద్ధంగా కూతవేస్తోంది.

"గుడ్! వచ్చేవా! ఇదిగో, ఈ యాభై రూపాయలు తీసికెళ్ళి మీ అమ్మకియ్యి. ఏదో చీర కొనుక్కోవాలంది." అంటూ జేబులో అస్తవ్యస్తంగా కుక్కిన నోట్లుతీసి కొడుకు చేతిలో పెడుతున్నాడు ప్రకాశం.

చలపతి లేచి తనకేమీ తెలియనట్లు ప్లాట్‌ఫారం మీదకు వచ్చేశాడు. ప్రకాశం దగ్గర ఆ డబ్బంతా ఈ కొద్దినిముషాల్లో ఎలా చేరిందో చలపతికి తెలుసు!

ప్రకాశం తెలివయినవాడు. భవిష్యత్తుకోసం బంగారుసోపానాలునిర్మించుకుంటున్నాడు.

మరి! తనో!?

ఎన్నో వేలమందికి సుఖమయిన ప్రయాణాలు జరగటానికి పడకలు, సీట్లు రిజర్వ్‌చేసి ఇచ్చేడు. కాని తన జీవనయాత్ర సుఖంగా ఒడుదుడుకులు లేకుండా సాగటానికి తాను ఏమీ రిజర్వ్ చేసుకోలేదు. అందర్నీ ఫస్టుక్లాసుల్లోనూ, స్లీపర్ కోచులలోనూ ఎక్కించి తాను మాత్రం ఆఖరు తరగతి ఇరుకు బోగీలో ప్రయాణిస్తున్నాడు.

తాను జీవితంలో తప్పుచేశాడా?

అవకాశం వున్నప్పుడు జారవిడుచుకున్నాడా?

ఏమో! అలాగే అనిపిస్తుంది. బంగారు కల కళ్ళముందు కరిగిపోయిన అనుభూతి కదుల్తోంది!

మెయిలు ప్లాట్‌ఫారం వదిలి సాగిపోతోంది.

దూరంగా సాగి మలుపు తిరిగిపోయింది! ఆఖరి బోగీవంకే చూస్తూ వుండిపోయాడు.

రైలు వెళ్ళిపోయింది!

"రైలు వెళ్ళిపోయింది..." చలపతి మెల్లగా గొణుక్కున్నాడు.